క్లుప్తంగా

కార్యకర్తలకు అండగా ఉంటాం


చెక్కు అందజేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహ

వట్‌పల్లి(అందోల్‌): కాంగ్రెస్‌ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహా అన్నారు. మండల పరిధిలోని ఖాదిరాబాద్‌ గ్రామానికి చెందిన కొన్యాల విఠల్‌ ఇటీవల ప్రమాదవశత్తు మరణించగా కాంగ్రెస్‌ సభ్యత్వం కలిగి ఉండడంతో మంగళవారం మృతుడి కుటుంబ సభ్యులకు రూ.2లక్షల బీమా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌ పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రమేశ్‌జ్యోషి, ఇస్మాయిల్‌, రాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం


పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీనివాస్‌గౌడ్‌

పటాన్‌చెరు టౌన్‌: కాంగ్రెస్‌ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్‌ అన్నారు. మండల పరిధిలోని చిట్కుల్‌ గ్రామానికి చెందిన 25 మంది యువకులు బీఆర్‌ఎస్‌, ఎన్‌ఎంఆర్‌ యువసేన యువకులు కాట శ్రీనివాస్‌గౌడ్‌ సమక్షంలో కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం జరుగుతుందన్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో నిరుద్యోగుల ఆత్మహత్యలు, రైతులకన్నీరు ఆగడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌ పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు సుధాకర్‌గౌడ్‌, నరేందర్‌రెడ్డి, వార్డ్‌మెంబర్‌ యాదగిరి, మాధవ్‌రెడ్డి, భవాని, శంకర్‌ పాల్గొన్నారు.

నేడు పోటీపరీక్షలపై అవగాహన సదస్సు

కొండాపూర్‌(సంగారెడ్డి): సంగారెడ్డిలోని స్ఫూర్తి డిగ్రీ కళాశాల, హైదరాబాద్‌లోని శిఖర్‌ ఐఏఎస్‌ అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం కెమిస్ట్‌ భవన్‌లో పోటీ పరీక్షలపై కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు కళాశాల చైర్మన్‌ ధారాసింగ్‌ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సులో భాగంగా విద్యార్థులు నైపుణ్యాలను ఏవిధంగా పెంపొందించుకోవాలనే అంశంపై శిఖర్‌ అకాడమిక్‌ డైరెక్టర్‌ దీపికారెడ్డి అవగాహన కల్పిస్తారన్నారు. సదస్సుకు సీనియర్‌ హైకోర్టు న్యాయవాదులు దొంతిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఇండియన్‌ ఎయిర్‌ఫోర్స్‌ టెలికమ్యూనికేషన్‌ ఇంజనీర్‌, డాక్టర్‌ రాజశేఖర్‌ హాజరుకానున్నారని తెలిపారు.

చిన్నచల్మెడలో ఆత్మీయ సమ్మేళనం


సమావేశంలో బీఆర్‌ఎస్‌ నాయకులు

మునిపల్లి(అందోల్‌): ఈ నెల 22వ తేదీన అందోల్‌ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్‌ ఆధ్వర్యంలో మండల స్థాయి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు బీఆర్‌ఎస్‌ యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికుమార్‌ తెలిపారు. మంగళవారం చిన్నచల్మెడలో బీఆర్‌ఎస్‌ ప్రజాప్రతినిధులతో ఆత్మీయ సమ్మేళనానికి సంబంధించిన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చంద్రయ్య పాల్గొన్నారు.

విరాళం అందజేత


విరాళం అందజేస్తున్న భిక్షపతి

వట్‌పల్లి(అందోల్‌): మండల పరిధిలోని మర్వెల్లి గ్రామంలో నూతనంగా చేపడుతున్న మల్లన్న ఆలయ నిర్మాణానికి బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకులు బిక్షపతి మంగళవారం రూ.1.10 లక్షల నగదును విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని సూచించారు.

విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు

నారాయణఖేడ్‌: మండల పరిధిలోని పైడిపల్లిలో ఈనెల 21 నుంచి 28వ తేదీ వరకు గణపతి, సుబ్రహ్మణేశ్వర, నాగేశ్వర ధ్వజస్తంభ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ఔత్సాహిక క్రీడాకారులకు ప్రోత్సాహం


జోగిపేట: క్రీడాకారులతో ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్‌


జిన్నారం: క్రీడాకారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జోగిపేట(అందోల్‌): ఔత్సాహిక క్రీడాకారులకు ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తోందని ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్‌ అన్నారు. మంగళవారం జోగిపేటలోని ఎన్టీఆర్‌ స్టేడియంలో సీఎం కప్‌ క్రీడాపోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారుల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయడమే సీఎం కప్‌ లక్ష్యమన్నారు అందులో భాగంగా ప్రభుత్వం ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. అనంతరం క్రీడా ప్రతిజ్ఞను ఎంపీడీఓ సత్యనారాయణ చదివి వినిపించారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్మన్‌ మల్లయ్య, రాష్ట్ర మార్క్‌ఫెడ్‌ డైరెక్టర్‌ జగన్మోహన్‌రెడ్డి, మున్సిపల్‌ వైస్‌చైర్మన్‌ ప్రవీణ్‌కుమార్‌, మున్సిపల్‌ కమిషనర్‌ తిరుపతి, వైస్‌ ఎంపీపీ మహేశ్వర్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్‌ నారాయణ, మల్లిఖార్జున్‌, జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యుడు లింగాగౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్‌: క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ కర్ర చాందీబాయి, జెడ్పీటీసీ లక్ష్మీబాయి, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ రుబీనా నజీబ్‌ అన్నారు. తహసీల్దార్‌ కార్యాలయ ఆవరణలో సీఎం కప్‌ క్రీడాపోటీలను మంగళవారం ప్రారంభించారు.బంజారా సేవాలాల్‌ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రమేష్‌ చౌహాన్‌, తహశీల్దార్‌ మురళీధర్‌, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

వట్‌పల్లి(అందోల్‌): మండల పరిధిలోని మర్వెల్లి ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం సీఎం కప్‌ క్రీడలను ఎంపీడీఓ జగదీశ్వర్‌, సర్పంచ్‌ మఠం శోభారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కబడ్డీ, వాలీబాల్‌, ఖోఖో పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో క్రీడల నిర్వహణ పీఏసీఎస్‌ చైర్మన్‌ వినోద్‌గౌడ్‌, అధికారి బాలయ్య, పాఠశాల హెచ్‌ఎం నాగిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి మంజ్రేకర్‌, నాయకులు సంగమేశ్వర్‌, సుభాష్‌గౌడ్‌ పాల్గొన్నారు.

కంది(సంగారెడ్డి): కందిలోని మైనారిటీ బాలుర గురుకుల పాఠశాల ఆవరణలో ఎంపీపీ సరళ పుల్లారెడ్డి, జెడ్పీటీసీ కొండల్‌రెడ్డి మంగళవారం సీఎం కప్‌ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. టోర్నమెంట్‌లో 18 జట్లు పాల్గొనగా ఖోఖోలో మొదటి బహుమతి వద్దేనగూడ తండా, వాలీబాల్‌లో తుంకిల్లతండా జట్లకు మొదటి బహుమతి దక్కింది. 100, 400 మీటర్ల పరుగు పందెంలో చేర్యాలకు చెందిన వినోద్‌నాయక్‌ ప్రథమ బహుమతి సాధించాడు. గెలుపొందిన జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. తహసీల్దార్‌ విజయలక్ష్మీ, ఎంపీడీఓ విశ్వప్రసాద్‌, ఎంపీఓ మహేందర్‌రెడ్డి, రూరల్‌ సీఐ శివలింగం, ఆత్మకమిటీ చైర్మన్‌ కృష్ణగౌడ్‌, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

సంగారెడ్డి టౌన్‌: గ్రామీణ స్థాయి క్రీడాకారుల ప్రతిభను గుర్తించాలని సంగారెడ్డి ఎంపీపీ లావణ్య అన్నారు. సంగారెడ్డిలో నిర్వహించిన సీఎం కప్‌ పోటీలలో భాగంగా మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు మంగళవారం బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవీందర్‌, తహసీల్దార్‌ విజయ్‌కుమార్‌ పాల్గొన్నారు.

జిన్నారం(పటాన్‌చెరు): క్రీడారంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. జిన్నారం, గుమ్మడిదల మండల కేంద్రాల్లో మంగళవారం సీఎం కప్‌ క్రీడాపోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా నియోజకవర్గంలో మూడు మినీస్టేడియాల నిర్మాణాన్ని చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీవైస్‌ చైర్మన్‌ ప్రభాకర్‌, గుమ్మడిదల జెడ్పీటీసీ కుమార్‌గౌడ్‌, ఎంపీపీ రవీందర్‌గౌడ్‌, ఎంపీడీఓలు, తహశీల్దార్‌లు, సర్పంచ్‌లు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.


కంది: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, అధికారులు


నారాయణఖేడ్‌: క్రీడలను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు


జోగిపేట: క్రీడా పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్‌

ప్రైవేట్‌ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న రమేష్‌

కొండాపూర్‌(సంగారెడ్డి): అడ్మిషన్ల పేరుతో ఇష్టానుసారంగా అధిక ఫీజుల వసూలుకు పాల్పడుతున్న ప్రైవేట్‌ జూనియర్‌ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రమేష్‌ డిమాండ్‌ చేశారు. మంగళవారం సంగారెడ్డిలోని ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే జిల్లా వ్యాప్తంగా జూనియర్‌ కళాశాలలు మాయమాటలతో ఇంటింటా ప్రచారం చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారన్నారు. విద్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేస్తూ అడ్మిషన్ల పేరుతో రాయితీలు ఇస్తామంటూ మోసం చేస్తున్న కళాశాలల యజమాన్యంపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు ఎర్రోళ్ల మహేష్‌, శ్రీకాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్‌

సంగారెడ్డి మున్సిపాలిటీ: చౌటకూర్‌లో కొనసాగుతున్న రేణుకా ఎల్లమ్మ విగ్రహ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు మంగళవారం వైభవంగా ముగిశాయి. ఈ నెల 12వ తేదీన ప్రారంభమైన ఉత్సవాలను ఐదు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఉత్సవాల్లో ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్‌, ఉమ్మడి రాష్ట్ర మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహ, గౌడ సంఘం జిల్లా నాయకులు నక్క నాగరాజుగౌడ్‌, ఆశన్నగౌడ్‌ వేరువేరుగా హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. గీత పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్‌ ఎంపీపీ గార్ల వీరేందర్‌, మార్కెట్‌ డైరెక్టర్‌ జగన్మోహన్‌రెడ్డి, జోగిపేట్‌ మున్సిపల్‌ చైర్మన్‌ మల్లయ్య, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు శివకుమార్‌, నాయకులు పాల్గొన్నారు.

లాభాల బాటలో ఖేడ్‌ ఆర్టీసీ డిపో


మాట్లాడుతున్న ఆర్టీసీ డీఎం మల్లేశయ్య

నారాయణఖేడ్‌: ఆర్టీసీ డిపో ప్రస్తుత నెలలో రూ.11.75లక్షల లాభంలో ఉందని డీఎం మల్లేశయ్య తెలిపారు. సోమవారం డిపోకు అత్యధికంగా రూ.13,32,275 ఆదాయం సమకూరినందునా మంగళవారం డిపోలో కండక్టర్లు, డ్రైవర్లు, కార్మికులతో గేట్‌మీటింగ్‌ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌ గత మార్చి 23 నుంచి వచ్చే జూన్‌ 30 వరకు 100 రోజుల్లో డిపోను లాభాల బాటలోకి తీసుకురావాలని లక్ష్యాన్ని నిర్దేశించగా సిబ్బంది కృషితో ఈపీకే పెరిగి ఇప్పటికే లాభాల బాటలోకి వచ్చిందని తెలిపారు. సిబ్బందిని అభినందిస్తూ ముమ్ముందు ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెటింగ్‌ సెల్‌ ఇన్‌చార్జి పాండు తదితరులు పాల్గొన్నారు.

పండ్ల వ్యాపారిపై కేసు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఇథనాల్‌ రిపెనార్‌ ఫౌడర్‌తో మామిడి పండ్లను మగ్గపెడుతున్న ఓ పండ్ల వ్యాపారిపై కేసు నమోదైన సంఘటన రామచంద్రాపురం పట్టణంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని జాతీయ రహదారిని ఆనుకొని కమల్‌ఖాన్‌ పండ్ల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. కాగా మామిడి పండ్లను ఇథనాల్‌ రిపెనార్‌ ఫౌడర్‌తో మగ్గ పెడుతున్నాడన్న సమాచారంతో సోమవారం ఎస్‌ఓటీ పోలీసులు మామిడి పండ్ల దుకాణంపై దాడి చేసి కెమికల్‌ ఫౌడర్‌ను స్వాధీనం చేసుకొని కమల్‌ఖాన్‌ అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఓటీ పోలీసుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జొన్న కొనుగోలు చేపట్టాలి

కల్హేర్‌(నారాయణఖేడ్‌): జొన్నల కొనుగోలు చేపట్టాలని కాంగ్రెస్‌ మండల అధ్యక్షులు పోచయ్య, నాయకులు గుండు నరేందర్‌, శంకర్‌గౌడ్‌ ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. మంగళవారం కల్హేర్‌లో విలేకరులతో మాట్లాడారు. జొన్నల కొనుగోలులో ప్రభుత్వం రైతులకు ఆంక్షలు పెట్టడం సరైందికాదన్నారు. ప్రభుత్వం స్పందించి పూర్తి స్థాయిలో జొన్నలు కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో నాయకులు సంజీవరెడ్డి, రవీందర్‌రెడ్డి, వల్లూరి గోపాల్‌ పాల్గొన్నారు.

పైప్‌లైన్‌ లీక్‌.. వృథాగా తాగునీరు



రామచంద్రపురం (పటాన్‌ చెరు): భారతినగర్‌ డివిజన్‌ పరిధిలోని మాక్స్‌ సొసైటీ కాలనీలో ప్రధాన తాగునీటి సరఫరా పైప్‌లైన్‌ పగిలి నెలలుగా తాగునీరు వృథాగా పోతోంది. ఈ విషయంపై కాలనీవాసులు అనేకసార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారుల స్పందించి నీటి వృథాను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

రోడ్డు పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న రవీందర్‌

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని మాదారం గ్రామంలో చేపట్టిన ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులను ఆ శాఖ డీఈ రవీందర్‌ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సురేందర్‌గౌడ్‌, గణేష్‌ పాల్గొన్నారు.

జూన్‌ 4న లింగాయత్‌ మహార్యాలీ


వాల్‌ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మునిపల్లి(అందోల్‌): వచ్చే నెల జూన్‌ 4వ తేదీన హైదరాబాద్‌లో లింగాయత్‌ మహార్యాలీ నిర్వహించనున్నట్లు లింగాయత్‌ బలిజ సంగారెడ్డి జిల్లా కమిటీ అధ్యక్షులు పృథ్వీరాజ్‌ తెలిపారు. మంగళవారం మండలంలోని మల్లారెడ్డిపేట, బుస్సారెడ్డిపల్లి గ్రామాల్లో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మల్లప్పస్వామి, విజయ్‌, రమేశ్‌, పృథ్వీరాజ్‌ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి


సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఇస్నాపూర్‌లో జీవీఆర్‌ ఎంటర్‌ప్రైజెస్‌ సౌజన్యంతో రూ.2కోట్లతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు మంగళవారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందించే నిధులతో పాటు సీఎస్‌ఆర్‌ నిధులతో గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇస్నాపూర్‌ గ్రామం శరవేగంగా విస్తరిస్తుండంతో నూతన కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు దశలవారీగా నిధులను కేటాయిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ బాలమణి శ్రీశైలం, మాజీ సర్పంచ్‌ వెంకటరెడ్డి, బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నాయకులు దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఉపసర్పంచ్‌ శోభ కృష్ణారెడ్డి, ఎంపీటీసీ శ్రీశైలం, నాయకులు గోవర్ధన్‌ రెడ్డి, రాజు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సీఎం కప్‌ క్రీడలు


రాయికోడ్‌: కబడ్డీ పోటీలో గెలిపొందిన జట్టుతో అధికారులు


జహీరాబాద్‌ టౌన్‌: ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

కోహీర్‌(జహీరాబాద్‌): సీఎం కప్‌ క్రీడల్లో భాగంగా మంగళవారం కోహీర్‌ పట్టణంలోని జూనియర్‌ కళాశాల, లాలాకుంట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మైదానాలలో వాలీబాల్‌, ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్‌ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన జట్లకు బుధవారం బహుమతులు అందజేస్తామని ఎంపీడీఓ సుజాతనాయక్‌ తెలిపారు.

జహీరాబాద్‌ టౌన్‌లో..

జహీరాబాద్‌ టౌన్‌: పట్టణంలోని రంజోల్‌ గురుకులంలో సీఎం కప్‌ క్రీడాపోటీలు కొనసాగుతున్నాయి. మంగళవారం మండలంలోని 8 గ్రామాల నుంచి 225 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. వీరికి ఖోఖో, కబడ్డీ, వాలీబాల్‌, అథ్లెటిక్స్‌, తదితర పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో 24 మందికి మొదటి, రెండో బహుమతి సాధించగా ఇద్దరు మూడో బహుమతిని సాధించారు. ఎంపీడీఓ సుమతి, ఎంఈఓ బస్వరాజ్‌, ఎపీఓ, పీఈటీలను క్రీడల పోటీలను పర్యవేక్షించారు.

రాయికోడ్‌(అందోల్‌): మండలంలోని నాగ్వార్‌ క్రీడా మైదానంలో సీఎం కప్‌ క్రీడాపోటీలు కొనసాగుతున్నాయి. వాలీబాల్‌ పోటీల్లో 14 జట్లు, కబడ్డీ పోటీల్లో 2 జట్లు, ఖోఖో పోటీల్లో 2 జట్లు పాల్గొన్నాయని ఎంపీడీఓ వెంకటేశం తెలిపారు. ఖోఖో పోటీల్లో నాగ్వార్‌–హుల్గేర గ్రామాల జట్లు తలపడగా హెల్గేర జట్టు, కబడ్డీ పోటీల్లో నల్లంపల్లి జట్టు విజేతగా నిలిచాయన్నారు. వాలీబాల్‌లో పీపడ్‌పల్లి, నాగ్వార్‌ జట్లు ఫైనల్‌ పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు. బుధవారం ఆయా క్రీడా విభాగాల్లో పోటీలు నిర్వహించి మండల స్థాయి సీఎం కప్‌ టోర్నమెంట్‌ విజేతలను ప్రకటిస్తామన్నారు.

ఎమ్మెల్యే మాణిక్‌రావుకు వినతిపత్రం అందజేత


వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు

జహీరాబాద్‌ టౌన్‌: రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు పే స్కేల్‌ ఇవ్వాలని కోరుతూ మంగళవారం వీఆర్‌ఏలు ఎమ్మెల్యే మాణిక్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏల జేఏసీ జిల్లా వైస్‌చైర్మన్‌ నాగరాజ్‌ మాట్లాడుతూ వీఆర్‌ఏలను ఆదుకుంటామని సీఎం కేసీఆర్‌ అసెంబ్లీ సాక్షిగా హామీనిచ్చారని గుర్తు చేశారు. పే స్కేల్‌ ఇవ్వాలని, 55 సంవత్సరాలు నిండిన వారి స్థానంలో వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. అదేవిధంగా డిగ్రీ పూర్తి చేసిన వారికి ప్రమోషన్‌ కల్పించి పదవి విరమణ తరువాత పింఛన్‌ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం నాయకులు జైపాల్‌, బస్వరాజ్‌, లావణ్య, దత్తు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక


నియామక పత్రాలను అందజేస్తున్న సత్యనారాయణ

సదాశివపేట రూరల్‌(సంగారెడ్డి): మండల పరిధిలోని పెద్దాపూర్‌ కురుమ యువత నూతన కమిటీని మంగళవారం ఆ సంఘం మండల అధ్యక్షుడు సత్యనారాయణ, యువత జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌ కుమార్‌ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షులుగా బీర్బల్‌, ఉపాధ్యక్షులుగా శ్రీశైలం, ప్రవీణ్‌, ప్రధాన కార్యదర్శిగా విజయ్‌ కుమార్‌, కార్యదర్శిగా అరుణ్‌, సహాయ కార్యదర్శిగా సంపత్‌, కోశాధికారిగా రవి, సలహాదారులుగా ప్రకాష్‌, మైపాల్‌ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘం నాయకులు యాదగిరి, నాగేష్‌, శ్రీహరి, కృష్ణ, రాములు, కోడూరి శ్రీశైలం, అంజయ్య, సంగయ్య, సోమశేఖర్‌, నవీన్‌ కుమార్‌, రమేష్‌, మురళి, రాజు, బిక్షపతి పాల్గొన్నారు.

పశువైద్య సేవలపై ఆరా


వైద్య అధికారులతో సిబ్బంది

సంగారెడ్డి మున్సిపాలిటీ/జహీరాబాద్‌: గ్రామాల్లో పశువుల సంరక్షణకు ఏర్పాటు చేసిన మొబైల్‌ వాహనాన్ని మంగళవారం జహీరాబాద్‌లో ఉన్నతాధికారులు తనిఖీ చేశారు. 1962 టోల్‌ ఫ్రీ నెంబర్‌ ద్వారా పట్టణ, గ్రామీణ ప్రాంతాల మూగజీవాలకు ఆరోగ్య సేవలను అందిస్తున్నాయి. ఈ క్రమంలో సంగారెడ్డి జిల్లాలోని ఐదు 1962 వాహనాలను రాష్ట్ర 1962 ప్రాజెక్ట్‌ మేనేజర్‌ డాక్టర్‌ బాగీష్‌ మిశ్రా, జిల్లా ప్రోగ్రామ్‌ మేనేజర్‌ షేక్‌ జాన్‌ షాహిద్‌ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టోల్‌ ఫ్రీ ద్వారా అందుతున్న సేవలను, వాహన నిర్వహణ తీరును పరిశీలించి సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్‌ షేక్‌ శాలిహుస్సేన్‌, జిల్లా ఫ్లీట్‌ కోఆర్డినేటర్‌ డాక్టర్‌ పవన్‌, సిబ్బంది పాల్గొన్నారు.

వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

జోగిపేట(అందోల్‌): వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్‌ చేస్తూ వీఓఏలు చేపట్టిన సమ్మె మంగళవారంతో 30వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వీఓఏలు మాట్లాడుతూ నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. మహిళా సంఘాలతో మమేకమై, మహిళా సంఘాల సభ్యుల ఆర్థికాభివృద్ధికి పాటు పడుతున్న గ్రామ సంఘం సహాయకులను పట్టించుకోకపోవడంలేదని వాపోయారు. ప్రభుత్వం స్పందించే వరకు సమ్మెను కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వీఓఏల సంఘం అధ్యక్షులు మల్లయ్య, కార్యదర్శి ఆంజనేయులు, వీఓఏలు పాల్గొన్నారు.

30వ రోజుకు వీఓఏల సమ్మె

జహీరాబాద్‌ టౌన్‌: తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట వీఓఏలు చేపట్టిన సమ్మె 30వరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వీఓఏలు మాట్లాడుతూ తమను సెర్ప్‌ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో యూనియన్‌ నాయకులు అశోక్‌, అన్నపూర్ణ, అనుసూయ, శశికళ, విజయ్‌కుమార్‌, మల్లేశం, లక్ష్మినారాయణ, రేణుక, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


జోగిపేట: సమ్మె చేస్తున్న వీఓఏలు


జహీరాబాద్‌ టౌన్‌: సమ్మె చేస్తున్న వీఓఏలు